www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 225 | మంగళవారం | 28 జనవరి, 2025

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్



- హామీల అమలుకు జేఏసీ సమ్మె నోటీసు
- ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న సంఘాల నేతలు

02

## ప్రపంచాభివృద్ధిలో యువత కీలక భూమిక

- వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం
- ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ,జనవరి 27: ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను

మిగతా 2 లో




02



## కేసీఆర్ పాలనే బాగుంది

- రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనార్థాలు
- పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం
- సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో

02

స్వాతంత్ర్యోద్యమాన్ని అవమానించేలా మోహన్ భగవత్ వ్యాఖ్యలు

అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించారు



# రాజ్యాంగం మార్చాలనేదే బీజేపీ ఎజెండా

రిజర్వేషన్లలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం

## మోదీ ప్రధాని అయిన నాటి నుంచి ప్రయత్నాలు

- ఇది ఎన్నికల ర్యాలీ కాదు.. ఓ యుద్ధం
- దేశంలో రెండు పరివార్‌ల మధ్య వార్
- ఇండోర్‌లో సీఎం రేవంత్

**ఇండోర్, జనవరి 27:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలనే దాగిన అజెండా ఉందని ఆరోపించారు. యూజీసీ డ్రాఫ్ట్ నిబంధనలను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని మౌహ్ పట్టణం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జన్మస్థలంలో, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జై బాపు-జై భీం-జై రాజ్యాంగం' సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. "రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాళ్లు (బీజేపీ) ఎలాంటి శక్తితో ఆ ప్రయత్నాలు చేస్తే, ఆ శక్తితోనే రాజ్యాంగాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తాం. అందుకే మేము ఇక్కడ మౌహ్‌లో సమావేశమయ్యాం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డాక్టర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం, రిజర్వేషన్ వ్యవస్థను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ దాగిన అజెండా దేశానికి మంచిది కాదని చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) డ్రాఫ్ట్ నిబంధనలను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఈ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను

మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

- మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు
- 10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న

02



## ట్రంప్ సంతకంతో కీలక మలుపు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ రావును డిపోర్ట్ చేయనున్న అమెరికా

02



## గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం?

- నక్సలైట్లతో కలసి వందలాదిమంది బిజెపి వాళ్లను హతమార్చారు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు
- ఈటెల రాజేందర్ నక్సలైట్ కాదంటూ కితాబు

03

## రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

- రాష్ట్రవ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి..
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

02



## గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

- 101కు చేరిన పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య
- 16 మంది రోగుల పరిస్థితి విషమం



02

## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

03

- మొత్తం 14 సవరణలను ఆమోదించిన కమిటీ



# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్, జనవరి 27:** తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్టులు, దర్యాప్తులు, విచారణ తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికి ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోనూ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

# ట్రంప్ సంతకంతో కీలక మలుపు

**హైదరాబాద్, జనవరి 27 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు తిరగనుంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతోపాటు శ్రవణ్ రావును అమెరికా ప్రభుత్వం డిపోర్ట్ చేయనుంది. అమెరికాలో వలసదారులు, క్రిమినల్ కేసులో నిందితులను ఆయా దేశాలకు అప్పగించాలని ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాకు రిమైండర్స్ లెటర్లను హైదరాబాద్ పోలీసులు పంపనున్నారు. ఇప్పటికే ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుకు కోర్ట్ అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిద్దరిని ఇండియాకు రప్పించేందుకు తాజా పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీరిపై బ్లూ, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. పాస్‌పోర్టు రద్దు, రెండు దేశాల మధ్య నేరస్తుల ఒప్పందం సంబంధించిన లేఖలను పోలీసులు మరోసారి పంపనున్నారు. ఇప్పటికే ఇద్దరిపై ఎల్ఓసీలు జారీ చేయడంతో ఇండియాలో అడుగుపెట్టగానే హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఫోన్ టాపింగ్ కేసులో ఏ1గా ప్రభాకరరావు, ఏ6 గా శ్రవణ్ రావు ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధకిషన్ రావు, అడిషనల్ ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు , డీఎస్పీ ప్రణీత్ రావులను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా.. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఒక కీలకమైన ఫైలుపై సంతకం చేశారు. అమెరికాలో తలదాచుకున్న ఇతర దేశాలకు చెందిన నేరస్తులు, క్రిమినల్ కేసులో నిందితులను ఆయా దేశాలను అప్పగించాలని ట్రాంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఆ ఫైల్‌పై సంతకం కూడా చేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇండియా వదిలి అమెరికాలో ఉన్న ఏ1 నిందితుడు ప్రభాకర్‌రావు, ఏ6 నిందితుడు శ్రవణ్‌రావులను ఇండియాకు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ పోలీసులు చాలా సార్లు అమెరికా ప్రభుత్వానికి లేఖలు రాశారు. వారిద్దరినీ తమకు అప్పగించాలని రెడ్ కార్నర్ నోటీసును కూడా జారీ చేశారు. వారి పాస్‌పోర్టులను కూడా రద్దు చేయాలంటూ అమెరికా ప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాశారు హైదరాబాద్ పోలీసులు. ఈ క్రమంలో ట్రంప్ సంతకంతో వచ్చే వారం పదిరోజుల్లో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు ఇండియా అప్పగిస్తే ఈ కేసులో కీలక అంశాలు బయటపడే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య నేరస్తుల ఒప్పందం చట్టం ప్రకారం మరోసారి అమెరికా ప్రభుత్వానికి హైదరాబాద్ పోలీసులు లేఖ రాసే అవకాశం ఉంది. ప్రభాకర్ రావు, శ్రవణ్‌రావుకు నాంపల్లి కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశాలపై పూర్తిస్థాయిలో అమెరికా ప్రభుత్వానికి హైదరాబాద్ పోలీసులు లేఖ రాసే అవకాశం ఉంది.

# కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు

## ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు




**హైదరాబాద్, జనవరి 27:** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు.. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

# రాజ్యాంగం మార్చాలనేదే బీజేపీ అజెండా..


మొదటి పేజీ తరువాయి

అవలంబిస్తోందని అన్నారు. స్వాతంత్రోద్యమాన్ని అవమానపర్చేలా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులోనే అంబేద్కర్ ను అవమాన పర్చారని అన్నారు. దేశంలో 90% మందికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదని, జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని రాహుల్ గాంధీ చెప్పారు. రిజర్వేషన్లలో ముఖ్యంగా ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజలను లూటీ చేస్తోందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు.



# ప్రపంచాభివృద్ధిలో యువత కీలక భూమిక

మొదటి పేజీ తరువాయి



తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు కొనసాగించాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యవత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

# కేసీఆర్ పాలనే బాగుంది

## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**మునుగోడు, జనవరి 27:** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

# గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో తొలిమరణం

## 101కు చేరిన పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య

**ముంబై, జనవరి 27:** గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో మహారాష్ట్రలో తొలి మరణం నమోదైనట్లుగా తెలుస్తున్నది. సోలాపూర్‌లో ఓ వ్యక్తి మరణించగా.. మరణానికి జీబీఎస్ కారణంగా మరణించినట్లుగా ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది. పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. మృతుడిని సోలాపూర్ నివాసిగా గుర్తించారు. సదరు వ్యక్తి కొద్దిరోజుల కిందట పుణేకు వచ్చాడని.. ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు. ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. ఆదివారం నాటికి సంఖ్య వందకుపైగా దాటింది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. ఇందులో 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా పూణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిఘా వేశారు. ఇప్పటివరకు, రాష్ట్రంలో 25,578 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 15,761 ఇండ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 నివాసాలు చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి. గుల్లెయిన్ బారే సిండ్రోమ్.. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. వ్యాధి సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. వ్యాధి లక్షణాల్లో బలహీనత.. విరేచనాలు ఉంటాయి. సాధారణంగా జీబీఎస్ సమస్య బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ రోగనిరోధక శక్తిని కూడా బలహీనంగా మారుస్తుంది. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బానిపడుతున్నారు. వ్యాధి బారినపడ్డ వారంతా కోలుకుంటుండడం విశేషం. తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని.. కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని.. బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.



# ఆర్టీసీలో సమ్మె సైరన్

## హామీల అమలుకు జేఏసీ సమ్మె నోటీసు

**హైదరాబాద్, జనవరి 27:** తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2 పీఆర్‌సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. ' మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు.' అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రయివేటుపరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒక వేళ అదే కనుక జరిగితే.. వేలాది మంది ఆర్టీసీ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న ప్రతిపాదనను మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

## రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి నగదు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 27:** రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మలచెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

మంగళవారం
28 జనవరి 2025



# గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

- నక్సలైట్లతో కలసి వందలాదిమంది బిజెపి వాళ్లను హతమార్చారు
- ఈటెల నక్సలైట్ కాదంటూ కితాబు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



కరీంనగర్, జనవరి 27 : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు. సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని.. నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం

- కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు
- మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..
- ప్రజలను మాయచేస్తున్న రేవంత్‌రెడ్డి : బండిసంజయ్

**హైదరాబాద్, జనవరి 27:** మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ధి చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ధి చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్ధమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో కీలక మార్పులు

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## సిఎస్‌కు నివేదిక ఇచ్చిన విద్యా కమిషన్

**హైదరాబాద్, జనవరి 27:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. నాణ్యమైన భోజనం పెట్టాలని కోరింది. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో వెలుగు చూసిన ఫుడ్ పాయిజన్ ఘటనలను దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను విద్యా కమిషన్ సందర్శించింది. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన.. తదితర అంశాలను కమిషన్ పరిశీలించి ఓ నివేదికను రూపొందించింది. సీఎస్ శాంతికుమారికి కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు నివేదిక అందించారు. నివేదికలో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూలో చేయాల్సిన మార్పులపై నివేదికలో పలు సూచనలు చేసింది. 'వారం వారం బిల్లులను చెల్లించాలి. ఇంటర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలి. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు అవసరమైన కాస్మోటిక్స్, ఇతరత్రా సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. ఇలా సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించవచ్చు' అని నివేదికలో కమిషన్ పేర్కొంది.



# హైకోర్టును ఆశ్రయించిన ఈటల రాజేందర్

**హైదరాబాద్, జనవరి 27:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈటల రాజేందర్ ఇటీవల పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చేయి చేసుకున్న విషయం తెలిసిందే. ఏకశిలానగర్‌లో సామాన్యుల భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పైగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు గూండాలను, కుక్కలను పెట్టి ఏకశిలానగర్ వాసులను బెదిరిస్తున్నారని, ఈ క్రమంలో వారి వద్దకు వెళ్లిన సమయంలో వారి తీరు పట్ల ఆగ్రహంతో చేయి చేసుకున్నట్లు ఈటల ఇదివరకే వెల్లడించారు. అయితే రియాల్టీ వ్యాపారిపై దాడి నేపథ్యంలో పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. వాచ్‌మన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈటల రాజేందర్ హైకోర్టును ఆశ్రయించారు.



# కేటీఆర్‌కు ఆలోచన తక్కువ.. ఆవేశం ఎక్కువ: మంత్రి సీతక్క



**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాలు (రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు ఆలోచన తక్కువ.. ఆవేశం ఎక్కువ అని ఎద్దేవా చేశారు. పథకాలు మండలంలో ఒక్క గ్రామానికే అంటూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డ సీతక్క.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి తీరుతామని హామీ ఇచ్చారు. నాలుగు కొత్త పథకాల ప్రారంభోత్సవాలతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి విడతలో భాగంగా హైదరాబాద్ జిల్లాను మినహాయించి రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక గ్రామంలో నాలుగు పథకాలు ప్రారంభించారు. దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఒక్క గ్రామంలోనే ఓట్లు అడిగిందా..? ఒక్క గ్రామ ప్రజలు ఓట్లు వేస్తేనే కాంగ్రెస్ నేతలు గెలిచారా..? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. అన్ని గ్రామాల్లో స్కీములు ఇంప్లిమెంట్ చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే కేటీఆర్ వ్యాఖ్యలకు పై విధంగా మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు.



# వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

**న్యూఢిల్లీ, జనవరి 27:** వక్ఫ్ బోర్డ్ అధికారాలకు కోత పెడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు'కు జెపిసి ఆమోదం లభించింది. ఈ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ సమావేశమైన పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సభ్యులు ప్రతిపాదించిన మొత్తం 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీలో ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా.. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. మొత్తంగా జేపీసీ సూచించిన 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

# ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

**న్యూఢిల్లీ, జనవరి 27 :** బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ డేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది. 2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.

# వీసీలుగా బ్యూరోక్రాట్స్‌ను నియామకం సరికాదు

## తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వెల్లడి

**హైదరాబాద్,జనవరి 27 :** వీసీల నియామకంలో యూజీసీ గైడ్‌లైన్స్‌పై తెలంగాణ ఉన్నత విద్యామండలి స్పందించింది. గైడ్‌లైన్స్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. వీసీలుగా బ్యూరోక్రాట్స్‌ను నియమించాలనుకోవడం సరికాదన్నారు. యూజీసీ గైడ్‌లైన్స్.. ప్రైవేటైజేషన్‌ను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. 'యూజీసీ గైడ్‌లైన్స్ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. రాష్ట్ర యూనివర్సిటీలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలున్నాయి. వర్సిటీలు స్వతంత్రంగా ఉండాలి. ఈ అంశంపై మేం ఒక కమిటీ వేసుకున్నాం. కమిటీ ఇచ్చే రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. వర్సిటీల్లో ఖాళీల భర్తీపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని బాలకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రాల పరిధిలోని విశ్వవిద్యాలయాల మార్గదర్శకాల్లో మార్పులు చేస్తామంటూ యూజీసీ రాష్ట్రాలకు ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే. వీటి ప్రకారం వీసీలను నియమించే అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి దఖలు పడతాయి.

# సూర్యాపేటలో మరో పరువు హత్య





సూర్యాపేట, జనవరి 27: సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లలమర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పేదల పక్షాన నిలుస్తుంది

## మోదీ సర్కార్‌కు వ్యాపారులే ముఖ్యం

## జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో రాహుల్

**ఇండోర్,జనవరి27 :** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని, వారికి అండగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలో ఉన్న తెలంగాణలో కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు, ఓబీసీలకు న్యాయం జరిగేలా పోరాడుతామని అన్నారు. సోమవారం ఇండోర్ లో నిర్వహించిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబి స్తోందని అన్నారు. స్వాతంత్రోద్యమాన్ని అవమానపర్చేలా ఆర్ఎస్-ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులోనే అంబేద్కర్ ను అవమాన పర్చారని అన్నారు. దేశంలో 90శాతం మందికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదని, జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని రాహుల్ గాంధీ చెప్పారు. రిజర్వేషన్లలో ముఖ్యంగా ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజలను లూటీ చేస్తోందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా భాజపా , ఆర్ఎస్ఎస్‌లపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో స్వాతంత్ర్య పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి బానిసలుగా మారు-స్తున్నారని ఆరోపణలు చేశారు. 'ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ రాజ్యాంగంపై దాడికి పాల్పడుతున్నారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి పరిస్థితులను భాజపా, ఆర్ఎస్ఎస్ మళ్లీ కోరుకుంటున్నాయి. దళితులు, వెనుకబడిన వర్గాలు,



ఆదివాసీలు, పేదలను మరోసారి బానిసలుగా మారు-స్తున్నాయి. రాజ్యాంగం మారిన రోజు ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు ఉండవు' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రాహుల్ దేశ విద్యా వ్యవస్థ గురించి ప్రస్తావించారు. 'ప్రైవేటు వ్యవస్థలో విద్య, వైద్య రంగాల యాజమాన్యం ఎవరి చేతిలో ఉంది..? మన భారత విద్యా రంగం స్టాంపులు, సర్టిఫికేట్ల వ్యవస్థగా మారింది. సర్టిఫికేట్లు వస్తే.. ఉద్యోగాలు వస్తాయని కోట్లాది మంది ప్రజలు భావిస్తున్నారు. ఇదంతా పచ్చి అబద్ధం. అలా చేస్తే మీ పిల్లలు దేశంలో ఎలాంటి ఉపాధి పొందలేరు. ఈ బిలియనీర్లు దేశ ఉపాధి వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, ఆర్ఎస్-ఎస్ నేతలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. 'ప్రస్తుతం హస్తం పార్టీని తప్పుపడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు స్వాతంత్ర్యం కోసం ఎటువంటి పోరాటం కూడా చేయలేదు. పేదరికం, నిరుద్యోగం నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



# మావోయిస్టులకు కాలం చెల్లిందా?

మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో వరుసబెట్టి నేతలు నేలకు ఒరిగారు. కేంద్రం కూడా మావోల అణచివేతకు పకడ్బందీ వ్యూహంతో అడుడులు వేస్తోంది. ప్రజల్లో వారికి స్థానం లేకపోవడం కూడా అణచివేతకు వ్యతిరేకత రావడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగినా పెద్దగా స్పందన రావడం లేదు. ఇకపో తేగతంలో తెలంగాణ, ఎపిల్లో వారి పట్టుబాగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. కేవలం ఛత్తీస్‌ఘడ్‌లో మా÷–తరమే కొంత ప్రభావం చూపుతున్నారు. అదికూడా అడవులకే పరిమితం కావడం, అడపాదడపా చిన్నాచితకగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. అడవిచుట్టూ ఉన్న గిరిజనులు కూడా తుపాకులకు భయపడి వారికి సలాం కొడుతున్నారు. అయితే ఎన్‌కౌంటర్లలో అందరూ నేలకు ఒరిగినా ఒక్క గిరిజనులు లేదా గిరిజన ప్రజలు కన్నీరు కార్చడం లేదు. కారణమేమంటే మావోలు ప్రజలతో సంబంధాలను వదులుకున్నారు.ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఆగిపయాయి. ప్రజల పక్షాన కొట్లాడడం లేదు. అందుకే మావోయిస్తు పార్టీ చివరి శ్వాస తీసుకుంటున్నది.నక్సలైట్ విముక్త భారత్ కోసం సాయుధ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో వందలాదిమంది మావోయిస్టులను నేలకూల్చారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ల్లోని అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణ స్పందన ఇది. మావోయిస్టులకు ఇక స్థానం లేదని, నక్సలిజం అంతరించిందని అన్నారు. తుపాకీతో రాజ్యం సాధించడం కల్ల అని తేలిపోయింది. భారత సైన్యం పెద్ద ఎత్తున విరుచుకుపడుతున్న నేపథ్యంలో మావోయిస్టులు భారీ మూల్యం చెల్లించుకోకతప్పడం లేదు. దేశ సైనిక సంపత్తి,టెక్నాలజీ, ఇతర వనరులతో పోల్చితే మావోయిస్టు పార్టీకి ఉన్న బలం చాలా తక్కువని చెప్పక తప్పదు. అలాగే బయట దేశాల నుంచి అందే సహాయం కూడా బాగా తగ్గిపోయింది. రిక్రూట్‌మెంట్ కూడా ఆగిపోయింది. యువత ఉద్యోగాన్వేషణలో పడింది. చచ్చ ఇసాధించేకన్నా బతికుండగానే సాధించుకోవాలన్న పట్టుదలతో యువత కెరీర్‌పై దృష్టి పెట్టింది. నాటి పీపుల్స్ వార్... మావోయిస్టు పార్టీగా మారాక 'సైనికీకరణ'కు ప్రాధాన్యం పెరిగింది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు, కంపెనీలు, బెటాలియన్లు, ప్లాటూన్లు పెరిగాయి. దట్టమైన అడవుల్లో, సురక్షిత, దుర్భేద్యమైన ప్రాంతాల్లో మాత్రమే మావోయిస్టు గెరిల్లా ఆర్మీ సంచారం సాధ్యం. అందుకే మావోయిస్టులు ఛత్తీస్ గఢ్‌లోని అబూజ్‌మడ్‌ను బేస్ క్యాంపుగా మార్చుకొని సాయుధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అబూజ్ మడ్ అడవుల్లోకి ప్రభుత్వం వరుస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం అట్టుడుకుతోంది. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కనీసం 27మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి ఉన్నారు. ఆయన తలపై కోటి రూపాయల నజరానా ఉంది. నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఛత్తీస్‌గఢ్‌ఒడిశాకు చెందిన సంయుక్త బలగాలు గరియాబంద్ జిల్లా పరిధిలోని కులహాదీ ఘాట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సంయుక్త బృందాలు ఈ 30, సిఆర్‌పిఎఫ్, కోబ్రా 25 బెటాలియన్‌కు చెందిన జవాన్లు, సిఆర్‌పిఎఫ్ 65, 201 బెటాలియన్‌తో పాటు ఎస్‌ఓజి నువ్వా పాడ బృందం సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య అడపదడపా కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ సమయంలో ఎస్ఎల్ఆర్ రైఫిల్‌తో పాటు పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మావోయిస్టు సంస్థ అధిపతి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగింది. ఈ ఎన్‌కౌంటర్‌తో నక్సలిజానికి మరో గట్టి దెబ్బ తగిలిందని, నక్సల్స్ రహిత భారత్ నిర్మాణంలో భద్రతా బలగాలు పెద్ద విజయాన్ని సాధించాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సిఆర్‌పిఎఫ్, ఎస్‌ఒజి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఒడిశా –ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంయుక్త ఆపరేషన్‌లో 27 మంది నక్సలైట్లను మట్టుబెట్టారని అన్నారు. నక్సల్స్ రహిత భారతదేశం కోసం మన సంకల్పం, మన భద్రతా దళాల ఉమ్మడి ప్రయత్నాలతో నక్సలిజం తుదిశ్వాస విడిచిందంటూ తన వ్యాఖ్యానించారు. 2026 మార్చికల్లా చత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రం కాగలదని రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అన్నారు. పోలీసులు, సీఆర్ పీఎఫ్ జవాన్ల సాహసం వల్లనే ఇది సాధ్యమవుతోందని చెబుతూ వారికి శాల్యూల్ అన్నారు. నిరుడు వివిధ ఎన్‌కౌంటర్లలో దాదాపు 219 మంది నక్సల్స్ హతమయ్యారు. ఇకపోతే ఇండియాలో మావోయిస్టు పార్టీ 'నూతన ప్రజాస్వామిక విప్లవ' లక్ష్యాన్ని చేరుకోగలదన్న ఆశలు ఎప్పుడో అడుగంటాయి. అందుకు తగిన వాతావరణం కూడా లేకుండా పోయింది. ప్రజలంతా సొంతంగా భూమికోసం, భుక్తి కోసం పోరాడుతున్నారు. వారికి అండగా మావోయిస్టులు ఎక్కడా కానరావడం లేదు. తాజా పరిస్థితుల్లో ఉనికి అన్నది మావోయిస్టులకు ఒక సవాల్ అని చెప్పక తప్పదు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందన్న నినాదానికి కాలం చెల్లింది. విప్లవ యుద్ధం అనేది ప్రజలను సమీకరించడం ద్వారా, వారిపై ఆధారపడటం ద్వారా మాత్రమే సాధించగలం. అయితే ఈ దేశంలో మావోయిస్టు పార్టీ చేస్తున్న పోరాటాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రజలతో సంబంధం లేకుండా చేస్తున్న పోరాటాలకు కాలం లేదన్న విషయం బలపడిపోయింది. చెల్లదని కూడా తేలిపోయింది. మావోయిస్టులు బాగా బలపడ్డ సందర్భాల్లో ప్రభుత్వాలు ఇంత శక్తిమంతంగా లేవు. అలాగే ప్రజలు కూడా బలంగా మావోయిస్టుల వెంట నడిచారు. మేధావులు, పత్రికలు కూడా అండగా నిలిచాయి. ఏ విప్లవమైనా ప్రారంభించే ముందు పరిస్థితులను సంపూర్ణంగా అధ్యయనం చేసి అంచనా వేయాలని కూడా మార్క్స్, ఎంగెల్స్ చెప్పారు. అలాంటి అంచనాల్లోనూ మావోయిస్టు పార్టీ విఫలమైందన్న భావన కలుగుతోంది. ప్రపంచంలో సోషలిస్టు శిబిరాలు కూలిపోయాక, పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛా వాణిజ్యం వర్ధిల్లుతున్నవి. ఈ దశలో భారతదేశంలో విప్లవం విజయవంతం కావడంపై అనుమానాలు సహజం. విప్లవం పతాక స్థాయికి చేరడానికి భారత్ చాలా దూరంలో ఉన్నది. విప్లవకారులు అత్యుత్సాహంతో కేవలం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఆశ్రయించారన్న విమర్శలున్నవి. ప్రజలకు దూరంగా చేసే పోరాటం ఎప్పటికీ నిలబడదు. ప్రజాస్వామ్యంలో ప్రజలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలే మట్టి కరుస్తున్నాయి.

# కుంభమేళాలలో అమిత్ షా

## స్వాగతం పలికిన సీఎం యోగి తదితరులు



**ప్రయాగ్‌రాజ్, జనవరి 27:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాకు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా స్నానమాచరించారు. పుణ్యస్నానం కోసం ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అమిత్ షాకు సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆయన మంత్రివర్గ సహచరులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బిజెపి నేతలు కూడా అమిత్ షాను స్వాగతించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు. ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు (అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

# చైతన్య విద్యాసంస్థలకు భారీ షాక్

**హైదరాబాద్, జనవరి 27:** మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఆహార భద్రతా విభాగం అధికారులు రద్దు చేశారు. గత శుక్రవారం శ్రీచైతన్య కిచెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేల మందికి భోజనం తయారు చేస్తున్న వంటగదిలో పాడైపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు తేల్చారు. ఈ వంటగది నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఆహారం సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ వండే భోజనాన్నే హాస్టళ్లలోని వేల మంది విద్యార్థులకు రోజూ అందజేస్తున్నట్లు నిర్ధారించారు. కిచెన్ మ్నొత్తం అపరిశుభ్రంగా ఉండడంపై ఆహార భద్రతా విభాగం అధికారులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కిచెన్‌ను సీజ్ చేయాలని, ఫుడ్ లైసెన్స్ రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు మాదాపూర్(ఖానామెట్)లోని చైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్ రద్దు చేస్తూ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వంటగదిలో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు ఉల్లంఘించి ఆహారం తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు

- గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం
- హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం
- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, జనవరి 27 :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడుతున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

మంగళవారం
28 జనవరి 2025





# అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

## ప్రజావాణి లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు 71, జిల్లా సంక్షేమ అధికారి 14, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల 11, డీసీఎస్ఓ 9, ఉపాధి కల్పన శాఖకు 6, ఎంపీడీవో కోనరావుపేట, ఎస్డీసీకి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారికి 4, సర్వే శాఖకు 3, మెడికల్ కళాశాల, విద్యాశాఖ, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఎంపీడీవో తంగళ్లపల్లి కి రెండు చొప్పున, మైన్స్, నీటి పారుదల శాఖ, ఎల్ డీఎం, హ్యాండ్ లూము అండ్ టెక్స్టైల్స్, జిల్లా సహకార అధికారి, ఎస్పీ ఆఫీస్, డీఎస్సీ డీఓ, యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్, అటవీశాఖ, ఎంపీడీవో ఎల్లారెడ్డిపేట, చందుర్తి, బోయినపల్లికి ఒకటి చొప్పున వచ్చాయి. మొత్తం 152 దరఖాస్తులు వచ్చాయి.

### వృద్ధురాలి ఇబ్బందిపై కలెక్టర్ సత్వర స్పందన

నడవలేక ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలి సమస్యపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝాహతక్షణం స్పందించారు. ఆమెకు వీల్ చైర్ అందజేసి, ఇబ్బందిని దూరం చేశారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మేరుగు విజయ చాలా రోజులుగా నడవలేక ఇబ్బంది పడుతున్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు.

# ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు చేయాలి

## మార్చి 5 వ తేదీ నుంచి పరీక్షలు.. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణహాపై సోమవారంహాసంబంధిత అధికారులతోహాజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించుటకు కట్టుదిటమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జనరల్ అలాగే వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 03-02-2025 నుంచి 22-02-2025 వరకు ఉదయం 09.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 02.00 గంటల నుంచి 05.00 గంటల వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంటర్ పరీక్షలు మార్చి 05-03-2025 నుంచి 25-03-2025 వరకు ఉ. 9.00 నుండి మ.12.00 వరకు పరీక్షలు జరుగుతాయని, ఫస్టియర్ విద్యార్థులు 5.065, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4,245 మొత్తం 9,310 మంది పరీక్షలకు హాజరుకానున్నారని కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచి నీరు , ఫ్యాన్లు, లైట్లు సరి అయిన విదంగా వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని , వెలుతురు వుండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనంతరంహాసమాధాన పత్రాలను సరిగా సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందిగా చేపట్టాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీఎంహెచ్వో డాక్టర్ రజిత, ఆర్టీసీ సెస్, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల(డోర్స్) 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో డోర్స్ ఫౌండర్ అండ్ చైర్మన్ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, అసోసియేషన్ బాధ్యులతో కలిసి ఆవిష్కరించి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల(డోర్స్) అధ్యక్షులు జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి శేషాద్రి, ట్రెజరర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసాచారి, వైస్ ప్రెసిడెంట్స్ జడ్పీ సీఈవో వినోద్, ఎస్డీసీ రాధాభాయ్, డీసీఓ రామకృష్ణ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**ప్రజానావ, బెల్లంపల్లి:** తాండూరు మండలంలోని గోపాల్ నగర్ గ్రామ పంచాయతీలో పక్క ఇల్లు, భూస్వాములకు అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని సోమవారం గ్రామస్తులు తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్ నగర్ పంచాయతీలో రీసర్వే చేసి అర్హులైన నిరుపేదలకు ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరారు. వీరికి టీడీపీ మండల ఇన్చార్జి దాసరి శ్రీనివాస్, సీపీఐ కార్యదర్శి సాలిగామ సంతోష్ మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజానావ, బెల్లంపల్లి:** తాండూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు కళ్యాణ్, యూత్ కాంగ్రెస్ డిస్టిక్ జనరల్ సెక్రెటరీ ఎండి జుబేర్ బాయ్, టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో గడ్డం వెంకటస్వామి (కాకా మెమోరియల్) మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి , తాండూర్ ఎస్ హెచ్ఓ కుమారస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ తాండూర్ మండలంలో మొదటిసారిగా కాక మెమోరియల్ క్రికెట్ ఆటలు నిర్వహించినందుకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ ఐ, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈసా, మాజీ మండల అధ్యక్షుడు సిరంగి శంకర్, కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్లలో మేయర్ పర్యటన



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ నగరంలో 15,30,34,47,54 డివిజన్లలో మేయర్ యాదగిరి సునీల్ రావు సోమవారం పర్యటించారు. నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ లో మా పాలకవర్గం లో జరిగిన అభివృద్ధి గత 70 ఎల్లలో ఏ పాలకవర్గం లో జరగలేదని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లిమిటెడ్ అభివృద్ధి లో బాగంగా 15,30,34,47,54 డివిజన్ లలో మేయర్ యాదగిరి సునీల్ రావు పర్యటించారు. రాబోయే రోజుల్లో కూడా కరీంనగర్ నగర అభివృద్ధి ని నిరంతరంగా కొనసాగించేలా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పోరేటర్లు చాడ గొండ బుచ్చిరెడ్డి, అనూప్, బండ సుమ రమణ, రాపర్తి విజయ, కొండపల్లి సరిత సతీష్, డివిజన్ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# సీపీకి మేయర్ ఫిర్యాదు

**ప్రజానావ, కరీంనగర్:** సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై సోమవారం మేయర్సునీల్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్ర మంతి బండి సంజయ్ కుమార్ ఆద్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరిన నేపథ్యంలో కొందరు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ..తన పరువుకు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 56వ డివిజన్ కార్పోరేటర్ వీ రాజేందర్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, 43 వ డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ నాయకులు నవాజ్ హుస్సేన్, ఇతర కొంత మంది నాయకులు ఫేస్ బుక్ తో పాటు ఇతర ప్రచార మాధ్యమాల్లో తన ఫొటోలను మార్ఫింగ్ చేసి తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

# బెల్లంపల్లి విద్యార్థికి ఉత్తమ అవార్డు



**ప్రజానావ, బెల్లంపల్లి:** హైదరాబాద్‌లోని షేక్‌పేటలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ప్రీమియర్ (సీఓఈ)లో ఇంటర్మీడియట్ 1వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రథమ్ పాండే, విద్య, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 26 జనవరి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ విద్యార్థి అవార్డును ప్రధాన ఉపాధ్యాయుడు బాలస్వామి చేతుల మీదుగా అందజేశారు, ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు గురువారెడ్డి, హౌస్ మాస్టర్ ఇస్మాయిల్ మహ్మద్, బాలకృష్ణ, బాలరాజు తదితర ఉపాధ్యాయులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం

## బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



**ప్రజానావ, బెల్లంపల్లి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బందితో కలిసి సీఈఆర్ క్లబ్ మందమర్రిలో ఆటో డ్రైవర్లకు, ప్రైవేట్ పాఠశాలల వ్యాన్ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు,ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి మంచిర్యాల బృందం పాల్గొని తమ పాటల ద్వారా వాహనదారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మజీద్, పోలీస్ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, వాహనదారులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ● హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
● కేజీబీవీలో ఐఐటీ- జేఈఈ ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం




**ప్రజానావ, ఇల్లంతకుంట:** విద్యతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యపడుతుందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి 8,9,10 వ తరగతి విద్యార్థినులకు ఐఐటీ జేఈఈ ఫౌండేషన్ ఆన్లైన్ కోర్స్ తరగతులను వారిద్దరు కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడారు. వ్యక్తిగత,సమాజ పురోభివృద్ధికి విద్యమాత్రమే మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. విద్యారంగంలో మహిళలకు సాధికారత లేకుంటే దేశం సమగ్ర అభివృద్ధిని సాధించబోదనీ స్పష్టం చేశారు. అందుకే మహిళలు చదువుల్లో రాణించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక విద్యా కార్యక్రమాలు కేవలం విద్యార్థినుల చదువుని మెరుగుపరచడమే కాకుండా, వారిలో సృజనాత్మకత, నిర్ణయాత్మక శక్తిని పెంచుతాయన్నారు. విద్యార్థినులు ప్రతి స్పందించిన తీరును చూసి కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్ రెడ్డి, జి సి డి ఓ పద్మజ, ఎంపీడీవో, కేజీబీవీ ఎస్ఓ శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో ఉండాలి

**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల:** రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వ్యవసాయ శాఖ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఏఏ పంటలు సాగు చేశారు? ఎరువులు ఇతర సామగ్రి పై ఆరా తీశారు. రైతు బీమా, పిఎం కిసాన్ తదితర పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. శాఖ అధికారులు తమ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాలను నిత్యం తనిఖీ చేయాలని, ఎరువులు, పురుగు మందుల నిల్వలు తదితరు అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. డిఏపి ఇతర ఎరువుల నిర్వహణపై జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ను అడిగి తెలుసుకున్నారు. సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. శాఖ పురోగతి, పథకాల అమలు తదితర అంశాలపై ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడిఏ రామారావు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



**ప్రజానావ, కరీంనగర్:** నగరంలోని ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం మేయర్ సునీల్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం ఆలోచన చేసిన మహనీయుల్లో అంబేద్కర్ ఒకరన్నారు. కార్పొరేటర్ శ్రీనివాస్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు రాపర్తి విజయ, బండ సుమా రమణారెడ్డి, సతీష్ , దురిశెట్టి అనుప్, కాసర్ల ఆనంద్ బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, కైలాస నవీన్ , తెలంగాణ అంబేద్కర్ సంఘం తీగలగుట్టపల్లి నాయకులు జంగపెల్లి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను

# సత్వరం పరిష్కరించాలి

## కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజా నావ, కరీంనగర్:** ప్రజావాణిలో చేసే ఫిర్యాదులను వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్ (స్థానిక సంస్థలు), లక్ష్మీకిరణ్ (రెవిన్యూ), ఇతర ఉన్నత అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణి కి మొత్తం 298 దరఖాస్తులు రాగా ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగర పాలిక సంస్థకు 45, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి 18, కొత్తపెల్లి తహసీల్దార్ కార్యాలయానికి 13 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





కరీంనగర్‌లోని కోతి రాంపూర్ ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ హామీ ఇవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కేంద్ర మంత్రులు ఖట్టర్, బండి సంజయ్‌చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు కళ్లెం వాసుదేవ రెడ్డి, మాసం గణేష్ లు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా డంపింగ్ యార్డ్ వల్ల కోతి రాంపూర్ ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని, ఇక నుంచి ఆ ఇబ్బంది ఉండదన్నారు.

\- ప్రజానావ, కరీంనగర్

# ఇటుక బట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



**ప్రజానావ, బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలో ఉన్న ఇటుక బట్టిలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ర్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 6న ప్రజావాణిలో ఇటుక బట్టిలపై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో మండల ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి విచారించారు. కల్లేపల్లి రోడ్డుకు పక్కన ఉన్న ఇటుక బట్టికి సంబంధించిన బూడిద, ఉనక, మట్టి నిల్వలు పెద్ద ఎత్తున ఉన్నాయని విచారణకు వచ్చిన ఎంపీఓకు ఫిర్యాదుదారుడు శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లారని తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటుక బట్టిపై ఫిర్యాదు చేస్తే అధికారులు నిర్లక్ష్య సమాధానాలు ఇవ్వడం అనుమానాలకు దారితీస్తుందని, వెంటనే ఈ నిల్వలను సీజ్ చేయాలని కోరారు. విచారణ మధ్యలోనే ముగించడం బాధాకరమని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మరోసారి కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి సాయి కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా

## ఎంపీడీఓ ఆఫీస్ ముందు వీరాపూర్ మహిళల నిరసన..

**ప్రజా నావ, బెజ్జంకి:** బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లో పేరు రాలేదని ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లో భూమి ఉన్న వారి పేర్లు జాబితాలో చేర్చి, గుంట భూమిలేని మా పేర్లు ఎందుకు రాలేదని నిరసన తెలిపారు. ఉపాధి హామీ పనిలో 2023 -2024 సంవత్సరంలో వంద రోజులు పూర్తి చేసామని అయినా మా పేరు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు బయటికి వచ్చి మాకు న్యాయం చేయ్యలని నినాదాలు చేయడంతో ఎంపీఓ మంజుల బయటికి వచ్చి వారి నుండి దరఖాస్తులు స్వీకరించి మరొకసారి విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఎంపీఓ మంజులని వివరణ కోరగా ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉండి వారి పేరు మీద భూమి లేని వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అర్హులుగా వారి పేర్లు వచ్చాయని, మరొకసారి వారి పేరు మీద భూమి ఉందో లేదో



అని వెరిఫై చేస్తామని, ఒకవేళ భూమి ఉన్నట్టు తెలిస్తే వారి పేర్లను బ్లాక్ లిస్టులో పెడతామని పేర్కొన్నారు.



## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో
# సంబురాలు

**ప్రజానావ, బెజ్జంకి:** మంద కృష్ణమాదిగాకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు వద్లూరి పర్శరాములు ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మోదుంపల్లి రాజు, సలహాదారులు తాడిచెట్టు భూమయ్య, టౌన్ అధ్యక్షుడు బోనగిరి చంద్రయ్య, సిద్దిపేట జిల్లా స్వేరో మాజీ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ కుమార్, కోఆర్డినేటర్ ఉప్లేటి బాబు, మహంకాళి రాజయ్య, సీనియర్ నాయకులు నంగునూరి అంజయ్య, నల్లగొండ అంజయ్య, కొంపెల్లి రాజు, మంకాళి బాలయ్య, బిగుళ్ల మోహన్ , వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై సంబురాలు జరుపుకుంటున్న దృశ్యం

# నాగోబా జాతరకు సిద్ధం

**ప్రజానావ, ఇంద్రవెల్లి :** ఆదివాసీల కొంగుబంగారంగా పిలువబడే నాగోబా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయంలో మాజీ ఎంపీ సోయం బాపురావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను, మెస్రం వంశీయుల కోనేరును, ఆలయ పరిసరాలను పరిశీలించారు. మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవం నాగోబా జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ఈ మహా జాతరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి సీతక్కతో పాటు పలువురు మంత్రుల రానున్నట్లు తెలిపారు. రేపటి నుండి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల విలువలను
# కాపాడండి

ప్రజానావ, కూకట్ పల్లి: జర్నలిస్టుల విలువలు దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న వారి పట్ల చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధి బృందం సోమవారం తహసీల్దార్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేపీహెచ్‌బీ కాలనీలోని మండల తహసిల్దార్ స్వామి నాయక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ బోర్లు వేసే దగ్గర కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. జర్నలిస్టుల పేరుతో సామాన్యులను బెదిరించడమే కాకుండా ఉన్నతాధికారులకు కూడా ఫోన్లు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఇది సరైన చర్యలు కావనివారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పేరు చెప్పుకొని బెదిరింపులకు పాల్పడుతున్న వారికి కొందరు రెవెన్యూ సిబ్బంది కూడా వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదు చేశారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
28 జనవరి 2025





## టీమ్ఇండియాకు గొప్ప సూపర్‌స్టార్ దొరికాడు..

### తిలక్‌కు ఆ సత్తా ఉంది : అంబటి రాయుడు

ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టును గెలిపించిన తిలక్ వర్మపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో భారత్ రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని టీమ్ఇండియా 19.2 ఓవర్లలో ఛేదించింది. తిలక్ (72) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆరంభంలో దూకుడుగా ఆడి ఇంగ్లాండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన తిలక్.. మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడటంతో మ్యాచ్ చివర్లో ఉత్కంఠభరితంగా మారింది. ఈక్రమంలో టెయిలెండర్లతో కలిసి జట్టును గట్టెక్కించాడు. ఈ మ్యాచ్‌లో అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈనేపథ్యంలో తిలక్ వర్మపై భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల వర్షం కురిపించాడు. తిలక్ టీ20 ప్లేయర్ మాత్రమే కాదని.. ఆల్-ఫార్మాట్ ప్లేయర్‌గా మారే సత్తా అతనికి ఉందన్నాడు. “టీమ్ఇండియాకు గొప్ప సూపర్‌స్టార్ దొరికాడని భావిస్తున్నా. అతను (తిలక్ వర్మ) టీ20 ప్లేయర్ మాత్రమే కాదు.. ఆల్-ఫార్మాట్ ప్లేయర్ కాగలడు. ఇంగ్లాండ్‌తో రెండో టీ20లో గొప్ప పరిపక్వత ప్రదర్శించాడు. చాలా సంవత్సరాలపాటు భారత్‌కు మ్యాచ్ విన్నర్‌గా ఉండగల సత్తా అతనికి ఉంది. కాబట్టి ప్రతి ఫార్మాట్‌లో తిలక్‌కు అవకాశాలు ఇస్తూ మద్దతుగా నిలవాలి. అతను సూపర్‌స్టార్ క్రికెటర్. హైదరాబాద్‌కు ఆడుతున్నప్పటినుంచి అతడిని చూస్తున్నా. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో అద్భుతంగా ఆడాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తిలక్‌పై నమ్మకం ఉంచాడు. తనపై పెట్టుకున్న నమ్మకానికి అతను న్యాయం చేస్తున్నాడు’ అని రాయుడు స్టార్‌స్పోర్ట్స్‌తో అన్నాడు. భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో టీ20 మంగళవారం (జనవరి 28) రాజ్‌కోట్‌లో జరగనుంది. మూడో మ్యాచ్‌లో గెలిచి మరో రెండు టీ20లు మిగిలివుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉంది.

## ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా




భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్‌ను ప్రతిష్టాత్మక ఐసీసీ అవార్డు వరించింది. 2024 సంవత్సరానికిగాను టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అతను ఎంపికయ్యాడు. జో రూట్ (ఇంగ్లాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), హ్యారీ బ్రూక్ (ఇంగ్లాండ్)లను వెనక్కినెట్టి బుమ్రా ఈ అవార్డును దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న ఆరో భారత క్రికెటర్‌గా బుమ్రా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్ (2004), గౌతమ్ గంభీర్ (2009), వీరేంద్ర సెహ్వాగ్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లీ (2018) బుమ్రా కంటే ముందు ఈ అవార్డు అందుకున్నారు. 2024 ఐసీసీ టెస్టు జట్టులోనూ బుమ్రా చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది టెస్టుల్లో బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే 2024లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

### వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా స్మృతి మంధాన



భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 2024 సంవత్సరానికిగాను వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు గెలుచుకుంది. లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా), చమరి ఆటపట్టు (శ్రీలంక), అన్నాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా)తో పోటీపడి ఈ అవార్డును సొంతం చేసుకుంది. 28 ఏళ్ల మంధాన ఈ ప్రతిష్టాత్మక అవార్డును గెలుచుకోవడం ఇది రెండోసారి. 2018లో మొదటిసారిగా వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైంది. ఈ క్రమంలోనే మహిళల క్రికెట్‌లో సుజీ బేట్స్ (న్యూజిలాండ్) తర్వాత రెండోసారి ఈ అవార్డు అందుకున్న రెండో ప్లేయర్‌గా స్మృతి మంధాన నిలిచింది. మంధాన 2018, 2021 సంవత్సరాల్లో ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సొంతం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్‌గా ఉన్న మంధాన గతేడాది వన్డేల్లో అదరగొట్టింది. 13 మ్యాచ్‌ల్లో 57.46 సగటుతో 747 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. ఇందులో నాలుగు సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలున్నాయి. పురుషుల విభాగంలో వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు అఫ్ఘనిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఎంపికయ్యాడు.

## పాక్‌కు విండీస్ షాక్.. 35 ఏళ్లకు తొలి విజయం




ముల్తాన్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో పాకిస్థాన్‌కు షాక్ తగిలింది. పాక్‌పై విండీస్ 120 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. పాకిస్థాన్ గడ్డపై కరేబియన్ జట్టు 35 ఏళ్లకు టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం విశేషం. దీనికంటే ముందు విండీస్ 1990 నవంబర్‌లో ఫైసలాబాద్‌లో జరిగిన టెస్టులో పాకిస్థాన్‌పై గెలిచింది. తర్వాత 1997, 2006లో పాక్ పర్యటనకు వెళ్లినా ఒక్క విజయం సాధించకుండానే ఇంటిముఖం పట్టింది. మళ్లీ ఇన్నాళ్లకు పాక్ గడ్డపై గెలిచి సంచలనం సృష్టించింది. 254 పరుగుల ఛేదనలో 76/4తో సోమవారం (మూడో రోజు) ఆటను ప్రారంభించిన పాకిస్థాన్.. 133 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో బాబర్ అజామ్ (31) టాప్ స్కోరర్. మహ్మద్ రిజ్వాన్ (25), కమ్రాన్ గులాం (19), సౌద్ షకీల్ (13), సల్మాన్ ఆఘా (15) పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ స్పిన్నర్లు జోమెల్ వారికన్ (5/35), కెవిన్ సింక్లైర్ (3/61), గుడాకేష్ మోటీ (2/35) పాక్‌ను దెబ్బకొట్టారు. ఈ మ్యాచ్‌లో విండీస్ గెలవడం అద్భుతమే అని చెప్పాలి. ఎందుకంటే తొలి ఇన్నింగ్స్‌లో 38/7 పీకల్లోతు కష్టాల్లో పడిన ఆ జట్టును టెయిలెండర్లు గుడాకేష్ మోటీ (55), కెమర్ రోచ్ (25), వారికన్ (36)లు ఆదుకున్నారు. దీంతో ఆ జట్టు 163 పరుగులు చేసి మళ్లీ పోటీలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 244 పరుగులు చేసింది. పాక్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 154 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 133 రన్స్‌కు కుప్పకూలింది.



## ఆమె నాకు చెల్లెలు లాంటిది..

### బాలీవుడ్ సింగర్‌తో డేటింగ్ వార్తలపై సిరాజ్ క్లారిటీ

టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ బాలీవుడ్ సింగర్ జనై భోస్లేతో ప్రేమలో పడ్డట్లు వార్తలొచ్చాయి. ఇటీవల ముంబయిలోని బాంద్రాలో జరిగిన ఆమె 23వ పుట్టినరోజు వేడుకలకు సిరాజ్ హాజరయ్యాడు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫొటోలను ఆమె తన ఇన్‌స్టాలో పోస్టు చేయగా.. అందులో సిరాజ్, జనై కలిసి దిగిన పిక్ కూడా ఉంది. అయితే, ఆ ఫొటోలో ఇద్దరూ కాస్త సన్నిహితంగా ఉన్నట్లు కనిపించడంతో, వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు పలు వెబ్‌సైట్‌లు వార్తలు రాసుకొచ్చాయి. దీంతో ఇదేదో తేడా కొట్టేలా ఉందని గ్రహించిన సిరాజ్ వెంటనే అలర్ట్ అయ్యాడు. దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని.. జనై తనకు చెల్లెలు లాంటిదని ఇన్‌స్టా స్టోరీలో క్లారిటీ ఇచ్చాడు. ఫొటోను షేర్ చేస్తూ.. ‘ఆమె లాంటి సోదరి నాకెవరూ లేరు. ఆమె లేకుండా నేను ఎక్కడా ఉండాలనుకోను. నక్షత్రాలతో చంద్రుడు ఉన్నట్లే.. ఆమె వెయ్యి మందిలో ఒకరు’ అనే కవిత్వాన్ని సిరాజ్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్టు చేశాడు. మరోవైపు, జనై సైతం ఈ ఊహాగానాలపై స్పందించారు. సిరాజ్ తనకు ప్రియమైన సోదరుడని పేర్కొంటూ ఇన్‌స్టా స్టోరీలో పోస్టు పెట్టారు. ఇంతకీ జనై భోస్లే ఎవరో తెలుసా లెజెండరీ సింగర్ ఆశా భోస్లే మనవరాలు.

## ముంబై జట్టుకు రోహిత్, యశస్వి, అయ్యర్ దూరం




ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ 2024-25లో ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ దూరం కానున్నారు. మేఘాలయతో గురువారం నుంచి ముంబై తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు భారత స్టార్ ఆటగాళ్లు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే శివమ్ దూబే.. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ నేపథ్యంలో ముంబై జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. నితీష్ కుమార్ రెడ్డి పక్కటెముకల గాయంతో సిరీస్ మొత్తానికి దూరమవ్వడంతో అతని స్థానంలో శివమ్ దూబేకు అవకాశం దక్కింది. ఇప్పటికే దూబే భారత జట్టుతో కలిసాడు. మరోవైపు బీసీసీఐ వార్షిక అవార్డ్‌ల కార్యక్రమం నేపథ్యంలోనే రోహిత్, యశస్వి, అయ్యర్‌లు ముంబై ఆఖరి లీగ్ రంజీ మ్యాచ్‌కు దూరంగా ఉంటారని తెలుస్తోంది. ఫిబ్రవరి 1న ముంబైలో ఈ కార్యక్రమం జరగనుంది. ఫిబ్రవరి రెండో తేదీనే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ క్యాంప్ నాగ్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే ముంబై ఆఖరి లీగ్ మ్యాచ్‌కు స్టార్ ఆటగాళ్లంతా దూరంగా ఉంటారని ఓ బీసీసీఐ అధికారి తెలిపాడు. ఫిబ్రవరి 6 నుంచి ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. 10 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్.. తీవ్రంగా నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులే చేసి వెనుదిరిగాడు. అయ్యర్ 11, 17 పరుగులే చేయగా.. యశస్వి జైస్వాల్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. దాంతో జమ్మూ కశ్మీర్ ముంబైపై ఘన విజయం సాధించింది. ప్రస్తుతం ముంబై 22 పాయింట్లతో ఉంది. మేఘాలయపై ఆ జట్టు గెలిస్తేనే నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. ముంబై నాకౌట్ చేరాలంటే.. జమ్మూ కశ్మీర్ చేతిలో బరోడా ఓటమిపాలవ్వాలి. రోహిత్ శర్మ కారణంగా గత మ్యాచ్‌కు దూరంగా ఉన్న ఆయుష్ మాత్రమే, సుయాన్ష్ షెడ్గే జట్టులోకి రానున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు.





## ఐపీఎల్‌లో ఏబీ డివిలియర్స్ సరైన జట్టుకు ఆడలేదు

### సంజయ్ షాకింగ్ కామెంట్స్

ఏబీ డివిలియర్స్.. టీమ్ఇండియా క్రికెట్ ఫ్యాన్స్ అభిమానించే అతి తక్కువమంది విదేశీ ఆటగాళ్లలో ఒకడు. ఈ మిస్టర్ 360 డిగ్రీల ఆటగాడు ఐపీఎల్‌లో ఎన్నో అద్భుతమైన విన్యాసాలు చేసి అభిమానుల మనసు దోచుకున్నాడు. ఐపీఎల్ ప్రారంభమైన మొదట్లో కొన్ని సీజన్లు దిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడిన డివిలియర్స్.. 2011-2021 వరకు 11 ఏళ్లపాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడాడు. 2021లో రిటైర్మెంట్ ప్రకటించిన అతను ఐపీఎల్‌లో మొత్తం 184 మ్యాచ్‌ల్లో 39.71 సగటు, 151.69 స్ట్రైక్‌రేట్‌తో 5,162 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 40 అర్ధ సెంచరీలున్నాయి. కానీ, ఆటగాడిగా ఒక్కసారి కూడా అతను ఐపీఎల్ టైటిల్‌ను ముద్దాడలేదు. ఇక, డివిలియర్స్ ఐపీఎల్ కెరీర్ గురించి భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో డివిలియర్స్ సరైన ఫ్రాంఛైజీ (జట్టు)కు ఆడలేదని వ్యాఖ్యానించాడు. అతడిని సరిగ్గా ఉపయోగించుకోలేదని, బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకా ముందు ఆడాల్సిందని అభిప్రాయపడ్డాడు. మిస్టర్ 360గా ఏబీ డివిలియర్స్‌ను సూర్యకుమార్ యాదవ్ డామినేట్ చేశాడా? అని స్టార్‌స్పోర్ట్స్ షోలో మంజ్రేకర్‌ను ప్రశ్నించగా.. ‘మ్యాచ్ విన్నింగ్ ఇంపాక్ట్‌పరంగా నేను అవుననే చెబుతాను. డివిలియర్స్ అద్భుతమైన ప్లేయర్. టెస్టుల్లో అతని సగటు 50. వన్డేల్లో ఇది అంతకంటే ఎక్కువ (53) ఉంది. టీ20 క్రికెట్‌లో సగటు తక్కువగా ఉంది. ఎన్నో శక్తిసామర్థ్యాలు అతడి సొంతం. అయితే, ఐపీఎల్‌లో అందుకు తగ్గట్టుగా అతడిని ఉపయోగించుకోలేదు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకా ముందు రావాల్సింది. ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి.. కానీ, డివిలియర్స్ సరైన జట్టుకు ఆడలేదు. వేరే టీమ్‌కు ఆడితే ఏబీ డివిలియర్స్ గొప్పతనాన్ని మనం చూసేవాళ్లం’ అని సమాధానమిచ్చాడు.

# పెళ్లిపై జాన్వీ కామెంట్స్..

## స్పందించిన ఖుషీ కపూర్



గతంలో ఓ ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ తన పెళ్లి గురించి చేసిన కామెంట్స్ తాజాగా వైరలవుతోన్న సంగతి తెలిసిందే. తనకు తిరుపతిలో పెళ్లి చేసుకోవాలని ఉందని.. భర్తకు సేవ చేసుకుంటూ పిల్లల్ని చూసుకుంటూ తిరుపతిలోనే జీవితాన్ని గడపాలని ఉందని జాన్వీ గతంలో చెప్పారు. తాజాగా ఈ కామెంట్స్‌పై ఆమె సోదరి ఖుషీ కపూర్ స్పందించారు. తన తాజా చిత్రం 'లవ్ యాపా' ప్రచారంలో భాగంగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖుషీ కపూర్ తన పెళ్లి గురించి మాట్లాడారు. అలాగే జాన్వీ కపూర్ కామెంట్స్‌ను కూడా ప్రస్తావించారు. "గ్రాండ్‌గా పెళ్లి చేసుకోవాలని నాకు చిన్నప్పటినుంచి ఉన్న కల. మా అక్క చెప్పినట్లే నాకూ తిరుపతిలోనే పెళ్లి చేసుకోవాలని ఉంది. నేను ముంబయికి చెందిన అమ్మాయిని. మా పెళ్లి తర్వాత మా నాన్న బోనీకపూర్ మాతోనే ఉండాలని కోరుకుంటాను. మేము ఉండే బిల్డింగ్‌లోనే మా నాన్న కూడా ఉండాలి. నేను, నా భర్త.. ఇద్దరు పిల్లలు.. చాలా పెంపుడు కుక్కలు.. జీవితాన్ని ఎప్పుడూ ఇలా ఊహించుకుంటాను" అని చెప్పారు. జాన్వీలానే మీరు కూడా మీ భర్త తలకు మసాజ్ చేస్తూ సేవ చేస్తారా అని అడగ్గా.. 'నేను అలాంటి సేవలు చేయను' అంటూ సరదాగా బదులిచ్చారు ఖుషీ. చిన్నప్పటి నుంచి పెళ్లి అంటే తనకు ఎంతో గౌరవముందని చెప్పిన ఖుషీ.. బంధువులు, స్నేహితుల పెళ్లిళ్లలోను తాను ఉత్సాహంగా పాల్గొని సందడి చేస్తానని చెప్పారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్. ఆ చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్నారు. ఇప్పుడు 'లవ్ యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు.

# ఓటీటీలో 'సంక్రాంతికి వస్తున్నాం'..!



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన క్రైమ్, కామెడీ ఎంటర్‌టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి విశేష ఆదరణ లభిస్తోంది. 13 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.276 కోట్లు వసూలు చేసింది. నార్త్ అమెరికాలోనూ హవా కొనసాగుతోంది. 2.7 మిలియన్ డాలర్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ వారం కూడా బాక్సాఫీస్ వద్ద క్రేజీ చిత్రాలేవీ లేకపోవడం 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి కలిసొచ్చే అంశం. ఈ క్రమంలో ఈ చిత్ర ఓటీటీ స్ట్రీమింగ్‌పై ఓ ఆసక్తికర చర్చ నడుస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' ఓటీటీ రైట్స్‌ను జీ5 దక్కించుకుంది. తొలుత అనుకున్న ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి 2వ వారంలో ఈ మూవీని స్ట్రీమింగ్‌కు తీసుకురావాలట. అయితే, మూవీని థియేటర్‌లో చూసేందుకు ప్రేక్షకులు క్యూ కడుతుండటంతో ఓటీటీ విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని టాక్. ఇదే విషయమై మేకర్స్ కూడా జీ5 టీమ్‌ను స్ట్రీమింగ్ కాస్త వాయిదా వేయమని రిక్వెస్ట్ చేస్తున్నారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించి చర్చలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది సంక్రాంతి కానుకగా వచ్చిన 'హను-మాన్'ను ఓటీటీ రైట్స్‌ను కూడా జీ5 దక్కించుకుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడంతో చిత్ర బృందం కోరిక మేరకు స్ట్రీమింగ్‌ను ఆలస్యం చేశారు. దీంతో ఫుల్‌రన్‌లో ఆ మూవీ మంచి వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం'కు కూడా ఆ వెసులుబాటు కల్పిస్తే, బాక్సాఫీస్ వద్ద మరిన్ని వసూళ్లు రాబట్టడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు గత డిసెంబరులో విడుదలైన 'పుష్ప2' 56 రోజుల తర్వాత ఓటీటీలోకి రాబోతోంది. అలా లెక్క వేసుకున్నా, ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటివారంలో మూవీ ఓటీటీకి రావచ్చు.






# ట్రైలర్ రిలీజ్‌కు తండేల్ రెడీ

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో వస్తోన్న రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్ తండేల్. చందూ మొండేటి డైరెక్ట్ చేస్తోన్న ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక్కొక్క పాటలను విడుదల చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇక మూవీ లవర్స్, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తండేల్ ట్రైలర్ అప్‌డేట్ అందించారు మేకర్స్. తండేల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్ శ్రీరామ పిక్చర్ ప్యాలెస్ (రామ టాకీస్ రోడ్) వద్ద నిర్వహించనున్నారు. జనవరి 28 సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్ ఉండబోతుందని తెలియజేశారు మేకర్స్. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.



# అందంతో కట్టిపడేస్తున్న ఈషారెబ్బ

నెట్టింట్లో ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోలతో రచ్చ చేసే ముద్దుగుమ్మల్లో ముందు వరసలో ఉంటుంది బ్యూటీ ఈషా రెబ్బ. ఈ బ్యూటీ అంతక ముందు తర్వాత అనే సినిమాతో తెలుగ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అయితే ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పాలి. అందం, అభినయం ఎంత ఉన్నా, అవకాశాల్లో మాత్రం చివరి ప్లేస్‌లో ఉంటుంది. ఈ అందాల తార. ఎప్పుడూ మంచి అవకాశాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో కుర్రకారుకు పిచ్చెక్కిస్తుంటుంది. తాజాగా ఈముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్‌లో చీరకట్టులో ఉన్న ఫొటోలను షేర్ చేసింది. ఇందులో ఈషా స్లీవ్ లెస్ జాకెట్ ధరించి, చీరలో చాలా అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.

# 'స్టార్' అనిపించుకోవడం నా కోరిక కాదు!

సూపర్ స్టార్ అనిపించుకోవడం తన కోరిక కాదని అంటోంది అందాల తార రష్మిక. గతేడాది 'పుష్ప 2'తో శ్రీవల్లిగా మరోసారి తెరపై మురిపించిన కథానాయికీమె. ప్రస్తుతం దక్షిణాదితో పాటు.. హిందీలోనూ వరుస అవకాశాలతో తీరిక లేకుండా గడుపుతోంది. త్వరలో బాలీవుడ్ కథానాయకుడు విక్కీ కౌశల్‌తో కలిసి 'ఛావా' చిత్రంలో మరో భిన్నమైన పాత్రతో ప్రేక్షకులను పలకరించడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక.. సినీరంగంలోకి రావడం, పాత్రల ఎంపిక గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "నేను ఈ సినీ ప్రపంచంలో భాగమవుతానని ఎప్పుడూ ఊహించలేదు. ఆ ఆలోచన కూడా నాలో లేదు. ఎక్కువగా హాస్టల్‌లో పెరిగినందున సినిమాలతో నాకు పరిచయం చాలా తక్కువ. మేము ప్రతి రోజు కేవలం 30 నిమిషాలు మాత్రమే టీవీ చూసేవాళ్లం. అప్పుడప్పుడూ మా నాన్నతో కలిసి సినిమాల్ని చూసేదాన్ని. దూరం నుంచే నటులను ఆరాధించేదాన్ని. కానీ అనుకోకుండా ఈ వృత్తిని ఎంచుకున్న నాపై ప్రేక్షకులు చూపిస్తున్న అపారమైన ప్రేమకు ఎప్పుడూ రుణపడే ఉంటా". "చాలా మంది ప్రేక్షకులు నన్ను సూపర్‌స్టార్ అని పిలుస్తుంటారు. ఇది వినడానికి ఆశ్చర్యంగా ఉంది. నటిగా ఎప్పుడూ అభిమానుల ముఖాల్లో చిరునవ్వు నింపడమే నా లక్ష్యం. వాళ్లు సూపర్ స్టార్ అంటుంటే నేను ఆ లక్ష్యాన్ని చేరుకున్నట్లు అనిపిస్తుంది. నిజానికి నేను సూపర్‌స్టార్ కావడం నా కోరిక కాదు. నిరంతరం ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు సినిమాల్ని, పాత్రల్ని ఎంచుకుంటూ వారిని మెప్పించాలనే అనుకుంటా. ప్రస్తుతం నేను ఈ బాటలోనే ప్రయాణిస్తున్నా". "ఒక నటిగా నా ఎదుగుదలకు ఎంచుకున్న ప్రతి పాత్ర నాకు దోహదపడిందనే అనుకుంటున్నా. సినిమాల్ని ఎంపిక చేసుకునేటప్పుడు... కథ నాకు సరిగ్గా అనిపించాలి. ఈ సమయంలో నేను ఇలాంటి సినిమా చేయాలని నా అభిమానులు కోరుకుంటున్నారా? అనే ప్రశ్న నాలో మెదులుతుంటుంది. ఇంతక ముందు నటించిన పాత్రల కన్నా భవిష్యత్తులో నేను చేయబోయే పాత్రకు భిన్నంగా ఏదో ఒకటి ఉండేలా చూసుకుంటా. కథ, పాత్ర, అందులోని భావోద్వేగాలు.. ఇలా అన్ని అంశాలు నాకు సరిగ్గా సరిపోతాయో లేదో చూసుకుంటా. ప్రస్తుతం నేను ఏకకాలంలో మూడు నాలుగు సినిమాలు చేస్తున్నా. ఇలా ఒకే సమయంలో భిన్నమైన పాత్రలు పోషించడం కష్టంగా ఉంది. కానీ.. దర్శకులు, సహనటులు నాకు ఎంతో సహకరిస్తున్నారు".

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**